# రివాల్వింగ్ ఛెయిర్

సారె రామమోహనరావు

ఆఫీసు కాంపౌండులోకి అడుగు పెట్టి గబగబా నడుచుకుంటూ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ లోకి ప్రవేశించాడు సూపర్‌వైజర్ బాబూరావు.

"గుడ్‌మార్నింగ్ సర్!" అంటూ బోర్డుల మీద కూర్చున్న నలుగురు ఆపరేటర్లు ఒకేసారి విష్ చేశారు.

"గుడ్‌మార్నింగ్" అని తను కూడ విష్ చేసి తన టేబుల్ దగ్గరకు నడిచాడు.

ఎదురుగా చెక్క కుర్చీ దర్శనమిచ్చింది.

ఆ కుర్చీని చూడగానే నీరు కారిపోయాడు బాబూరావు.

రోజూ తను ఆ చెక్క కుర్చీలో కూర్చోలేక పోతున్నాడు. ఎక్స్ఛేంజ్ రూమ్ కంతటికి ఆ చెక్క కుర్చీ దిష్టిబొమ్మలా వుంటుంది. తను పన్నెండు మంది టెలిఫోన్ ఆపరేటర్లకు సూపర్‌వైజరు. అంటే తను వాళ్లందరి మీద పెద్ద. కాబట్టి తనకి రివాల్వింగ్ ఛెయిర్ వుంటే బాగుంటుంది. ఆఫీసర్ని ఎప్పటి నుంచో అడగాలని అనుకుంటున్నాడు. ఈరోజు ఆఫీసరు అనంతాన్ని తనకి రివాల్వింగ్ ఛెయిర్ కావాలని తప్పకుండా అడగాలి.

నిస్పత్తువగా కుర్చీలో కూలబడ్డాడు బాబూరావు.

ఆపరేటర్లందరూ డ్యూటీకి వచ్చారోలేదో అటెండెన్స్ రిజిస్టర్ చూసి, తను కూడ సైన్ చేశాడు. మస్టర్ రిపోర్ట్ తయారుచేసి ఆఫీసరు అనంతం సైన్ కోసం కారిడార్‌లోకి వచ్చాడు. నెమ్మదిగా నడుచుకుంటూ గదిలోకి ప్రవేశించాడు.

ఆఫీసరు అనంతం టేబుల్ ముందు రివాల్వింగ్ ఛెయిర్‌లో కూర్చుని ఓ చేత్తో ఫైల్స్ చూస్తూ, మరో చేత్తో విలాసంగా సిగరెట్ కాల్చుకుంటున్నాడు.

తన రాకని తెలియబరుస్తూ చిన్నగా దగ్గాడు బాబూరావు.

అనంతం తలెత్తి చూశాడు.

బాబూరావు వినయంగా మస్టర్ రిపోర్టు ఆయన టేబుల్ మీద వుంచాడు.

అనంతం మస్టర్ రిపోర్టు మీద సైన్ చేసి మళ్లీ ఫైల్స్ చూడటంలో మునిగిపోయాడు.

కొంచెంసేపయాక అనంతం ఎందుకో తల పైకెత్తాడు.

బాబూరావు ఇంకా అక్కడే నిలబడి వున్నాడు.

"ఏమిటోయ్ బాబూరావ్? ఏం కావాలి?" అని అడిగాడు అనంతం.

"తమరికో విషయం మనవి చెయ్యాలను కొంటున్నాను." అన్నాడు బాబూరావు ఎంతో వినయంగా.

"ఏమిటది."

"ఏమీలేదు సార్! నాదో చిన్న కోరిక. ఎప్పటినుంచో మిమ్మల్ని అడగాలనుకుంటున్నాను. ఎక్స్ఛేంజ్‌లోని చెక్క కుర్చీలో కూర్చోవటం నాకు చాలా ఇబ్బందిగా వుంటోంది సార్! ఎక్కువ సేపు ఆ కుర్చీలో కూర్చోలేకపోతున్నాను... కాస్త పెద్ద వయసువాడినికదా. కూర్చున్నచోట ఒత్తుకుపోయి నొప్పిపెడుతోంది" అన్నాడు బాబూరావు.

"అయితే ఏమిటంటావ్?" అన్నాడు అనంతం.

"తమరు తలుచుకుంటే ఎలాంటి పనైనా చేయించగలరు. కాబట్టి ఆ చెక్కకుర్చీ స్థానంలో మీరు నాకొక రివాల్వింగ్ ఛెయిర్ వేయిస్తే..." అంటూ ఆగిపోయాడు బాబూరావు.

"బాబూరావ్! ఏమిటి సంగతి? ఈ మధ్య నీ కోరికలు ఆకాశాన్ని అంటుతున్నట్లున్నాయి. పోనీ కావాలంటే నువ్వొచ్చి నా సీట్లో కూర్చో. నేను పోయి నీ కుర్చీలో కూర్చుంటాను" అన్నాడు అనంతం.

"అదికాదు సార్!.." అంటూ బాబూరావు ఏదో అనబోయాడు.

"ఇక నువ్వేమీ మాట్లాడనవసరంలేదు. యు కెన్ గో" అన్నాడు అనంతం.

బాబూరావు బాధగా వెనుదిరిగాడు.

విచారంగా వచ్చి తన చెక్క కుర్చీలో కూర్చున్నాడు.

ఆఫీసరు అనంతం తనని అనుగ్రహించలేదు. ఇక తనకి రివాల్వింగ్ ఛెయిర్ వచ్చే ప్రాప్తం లేదు అని అనుకున్నాడు.

అంతలోనే —

అతనికి మరో ఆలోచన వచ్చింది. "అవును. అలాచేస్తే..." అని అనుకున్నాడు.

ఆఫీసరు అనంతం భార్య ఆండాళ్ళమ్మది తన వూరే. ఆవిడ తనకి బాగా తెలుసుకూడాను. వాళ్ళ ఇంటికి తను ఎప్పుడు వెళ్ళినా ఆవిడ తన యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటూ వుంటుంది. ఒకసారి ఆవిడ తనతో అంది కూడాను — "బాబూరావ్! అయ్యగారివల్ల నీకేదైనా పని జరక్కపోతే నాకుచెప్పు. నేను అయ్యేలా చేస్తాను" అని.

వెంటనే ఈ విషయాన్ని అమ్మగారి చెవిన వేసి ఆవిడ ద్వారా రివాల్వింగ్ ఛెయిర్ సాధిద్దామనుకున్నాడు.

సాయంకాలం నాలుగయింది.

సెకెండ్ షిఫ్ట్ ఎక్కిన ఆపరేటర్లలో సీనియర్ ఆపరేటర్‌కి చెప్పవలసిన జాగ్రత్తలన్నీ చెప్పి, నైట్ డ్యూటీ సీనియర్ ఆపరేటర్‌కి కూడ ఆ జాగ్రత్తలు పాస్ చెయ్యమని చెప్పి, రిజిస్టర్‌లో ఆఫ్ డ్యూటీ సంతకం చేసి బయట పడ్డాడు బాబూరావు.

అమ్మగారి దగ్గరకు వెళుతున్నప్పుడు వట్టి చేతులతో వెళితే బాగుండదని దారిలో పెద్ద పనసపండొకటి కొన్నాడు. దానిని మొయ్యలేక మొయ్యలేక మోస్తూ అమ్మగారి దగ్గరకు బయలుదేరాడు.

బాబూరావుని — ముఖ్యంగా అతని చేతిలోని పనసపండుని చూడగానే ఆండాళ్ళమ్మగారి ముఖం చాటంత అయింది.

బాబూరావు నమస్కారం చేసి పనసపండుని ఆమెకి అందించాడు. పనివాడిని పిలిచి ఆమె ఆ పనసపండుని లోపల పెట్టమంది. పైకి మాత్రం "ఇప్పుడిలాంటివన్నీ ఎందుకు బాబూరావ్?" అంటూ మొహమాటం నటించింది.

"ఫరవాలేదండీ! ఏదో నా తృప్తికోసం" అంటూ చేతులు నలుపుకుంటూ నిలబడ్డాడు బాబూరావు.

ఎవరైనా చేతిలో ఏదైనా వస్తువుతో ఇంటికి వచ్చారంటే తనతో ఏదో పని పడ్డదని ఇట్టే గ్రహించేయగలదిట్ట ఆండాళ్ళమ్మగారు.

"అయ్యగారు నిన్ను ఆఫీసులో బాగానే చూసుకుంటున్నారా?" అడిగిందామె.

"ఏదో తమరి దయవల్ల బాగానే చూసుకుంటున్నారండీ! కాని ..." అంటూ నసిగాడు, అసలు విషయం చెప్పబోతున్నట్లు.

"ఆఁ ఏమిటి? ఏమయింది?" అడిగారు ఆండాళ్ళమ్మగారు.

''అహా ! ఏమీలేదండీ ! ఎక్స్పెంట్‌లోని నాకు రోజూ చెక్కకుర్చీలో కూర్చోవడం ఇబ్బందిగా వుంటోందండీ ! అందులోనూ నా వయసు కాస్త పెద్దదేమో... కూర్చున్నచోట ఒత్తుకుపోయి నొప్పిపెడుతోందండీ ! అందుకని నాకో రివాల్వింగ్ ఛెయిర్ వేయించమని అయ్యగార్ని అడిగానండీ ! కాని, అయ్యగారు కోప్పడ్డారు. ఇదండమ్మా సంగతి'' వివరించాడు బాబూరావు.

''ఆపరేటర్లకి నువ్వు హెడ్డువికదూ !'' అడిగారు ఆండాళ్ళమ్మగారు ఏదో ఆలోచిస్తూ.

''అవునండి'' అన్నాడు బాబూరావు.

''అయితే నీకు తప్పకుండా రివాల్వింగ్ ఛెయిర్ వుండి తీరాల్సిందే!'' అన్నారు ఆండాళ్ళమ్మగారు.

''అవునండీ'' అన్నాడు బాబూరావు మరింత వినయంగా.

''నేనీ విషయం అయ్యగారితో మాట్లాడతాను. త్వరలోనే నీకు రివాల్వింగ్ ఛెయిర్ వచ్చే ఏర్పాటు చేస్తాను'' భరోసా ఇచ్చారు ఆండాళ్ళమ్మగారు.

బాబూరావు మనసులో ఎంతో సంతోషించాడు. తను తీసుకొచ్చిన పనసపండు ఫలితం వృధా పోలేదని అనుకున్నాడు.

''ఏదో తమరి దయండీ అమ్మగారూ ! వస్తాను'' అని ఆండాళ్ళమ్మగారి దగ్గర సెలవు తీసుకున్నాడు బాబూరావు.

* * *

రెండు రోజులు గడిచాయి.

ఆ రోజు వుదయమే బాబూరావు డ్యూటీకి వస్తూ తన టేబుల్ ముందు రివాల్వింగ్ ఛెయిర్ వుండడం చూసి ఎగిరి గంతేసినంత పని చేశాడు.

దర్జాగా ఛెయిర్‌లో కూర్చున్నాడు. పైకి, క్రిందికి ఎగిరాడు. వెనక్కి, ముందుకి వూగాడు. ఛెయిర్‌లో గుండ్రంగా రెండుసార్లు తిరిగాడు. ఆ ఛెయిర్‌లో కూర్చునేసరికి ఆఫీసరు అనంతంలా ఫీలయ్యాడు.



# రివాల్వింగ్ ఛెయిర్

ఒక్కసారిగా పొజిషన్స్‌లో కూర్చుని పని చేసుకుంటున్న ఆపరేటర్లమీద ఆఫీసర్‌లా తన సూపర్‌వైజర్ దర్పాన్ని ప్రదర్శించాలనిపించింది. అవకాశం కోసం ఆపరేటర్లని పరిశీలించసాగాడు.

ఇంతలో బోర్డు మీద ఫస్ట్ పొజిషన్‌లో కూర్చున్న కామేశం అనే ఆపరేటర్ లేచి—

"సర్ ! సూపర్‌వైజర్‌గారూ ! కాస్త బాత్‌రూమ్‌కి వెళ్లొస్తాను" అన్నాడు.

"ఏమిటోయ్ కామేశం ? రోజుకు నువ్వెన్నిసార్లు బాత్‌రూమ్‌కి వెళ్తావు ? మనిషన్నాక కాస్త బుద్ధుండాలయ్యా ! డ్యూటీకి వచ్చి ఇంకా గంటన్నా కాలేదు అప్పుడే నీకు బాత్‌రూమా ? వెళ్లొద్దు కూర్చో" అన్నాడు.

పాపం ! కామేశం బిక్కముఖంతో మళ్లీ తన పొజిషన్‌లో కూర్చున్నాడు.

బాబూరావు రివాల్వింగ్ ఛెయిర్‌లో వెనక్కీ ముందుకీ వూగుతూ ఆపరేటర్ల వర్కుని గమనించసాగాడు.

సుబ్బారావు అనే ఓ ఆపరేటరు ఒక సివిల్ కాల్‌ని అటెండ్ చేస్తూ 'గుడ్‌మార్నింగ్ సర్' అని అడ్రస్ చెయ్యలేదు.

బాబూరావుకి అవకాశం దొరికింది.

"సుబ్బారావ్ నీకెన్నిసార్లు చెప్పాను— కాల్ అటెండ్ అయ్యేముందు 'గుడ్‌మార్నింగ్ సర్' అని అడ్రస్ చెయ్యాలని. అలా అడ్రస్ చెయ్యాలని నీకు తెలీదు ? నీ ఐదేళ్ల సర్వీసులోను నువ్వు నేర్చుకున్నది ఇదేనా ? ఈసారి కొత్త అటెండ్ చేస్తున్నప్పుడు 'గుడ్‌మార్నింగ్ సర్' అని అడ్రస్ చెయ్యకపోతే నీకు వార్నింగ్ లెటర్ ఇప్పిస్తాను. జాగ్రత్త !" అంటూ ఫైరైపోయాడు.

సుబ్బారావు ముఖం మాడిపోయింది.

ఓ అరగంట గడిచింది.

బాబూరావు రివాల్వింగ్ ఛెయిర్‌లో వెనక్కీ, ముందుకీ వూగుతూ ఆపరేటర్లని గమనించసాగాడు.

ఇంతలో లేడీ ఆపరేటర్ సరళ తన పొజిషన్‌లోంచి లేచి—

"సూపర్‌వైజర్‌గారూ ! కాస్త ఎడ్మిన్ సెక్షన్‌కి వెళ్లి జి. పి. ఎఫ్‌లోను ఫారాలు తెచ్చుకుంటాను" అంది.

"ఏమ్మా వెళ్ళడానికి నీకిదేనా సమయం. ఇప్పుడు వెళ్ళడానికి వీల్లేదు. నీ డ్యూటీ అయిపోయాక వెళ్ళు" కరకుగా అన్నాడు బాబూరావు.

సరళ ముఖం కందగడ్డలా అయింది.

బాబూరావు రివాల్వింగ్ ఛెయిర్‌యొక్క ఆనందాన్ని అనుభూతిని అనుభవిస్తూ వెనక్కీ ముందుకీ వూగుతూనే వున్నాడు. ఛాన్స్ దొరికితే ఆపరేటర్లమీద ఫైరైపోవాలని చూస్తూనే వున్నాడు.

మరో గంట గడిచింది.



సీనియర్ ఆపరేటర్ తాతారావు తన పొజిషన్‌లోంచి లేచి —

"బాబూరావుగారూ ! కాస్త టీ తాగి వస్తాను" అన్నాడు.

బాబూరావు సీరియస్‌గా ముఖం పెట్టాడు.

"నువ్వు రోజూ టీ టైమ్‌లో టీ తాగుతూనే వున్నావుకదా! మళ్ళీ మధ్యలో టీ అంటూ బోర్డుమీద నుంచి లేచిపోతావేం ? నువ్వు సీనియర్ ఆపరేటర్‌వి. నాకు కాస్త బుద్ధుండాలయ్యా ! నిన్ను చూసి మిగతా ఆపరేటర్లుకూడ ఇలాగే చేస్తారని నువ్వు తెలుసుకోవాలి. ఇక ముందు నువ్వు మాటి మాటికీ టీకి వెళ్ళే ప్రవర్తన మార్చుకోకపోతే నిన్ను ఆఫీసర్‌గారి దగ్గరకు తీసుకువెళ్ళాల్సి వుంటుంది. జాగ్రత్త !" అన్నాడు.

## తేడా

కొద్దిగా మచ్చ వుందని
సిగ్గుపడి చంద్రుడు
అప్పుడప్పుడైనా
మబ్బు చాటున మోము
దాచుకుంటాడు —
ఈ మనిషి మాత్రం
తప్పులు చేస్తూనే
తల ఎత్తుకు తిరుగుతాడు !

— వలి

తాతారావు ముఖంలో రంగులు మారాయి.

బాబూరావు రివాల్వింగ్ ఛెయిర్‌లో గాలిలో తేలిపోసాగాడు.

"ఆహా ! ఏమి తన భాగ్యం ! రివాల్వింగ్ ఛెయిర్‌లో కూర్చునేసరకి తనకి ఎంత హుందా వచ్చింది ? ఈ రివాల్వింగ్ ఛెయిర్‌లో ఆఫీసరు అనంతంకంటే కూడ చక్కగా ఆపరేటర్లని కంట్రోల్ చేయగలుగుతున్నాడు. అలా చేయగలుగుతున్నాడు అంటే, ఈ ఘనత తనదికాదు. రివాల్వింగ్ ఛెయిర్‌ది. రివాల్వింగ్ ఛెయిరూ ! నీకు నా జోహారు !" అని మనసులోనే దానికి జోహార్లు అర్పించుకున్నాడు బాబూరావు.

మధ్యాహ్నం రెండయింది.

రిలీవర్స్ రాగానే మార్నింగ్ షిఫ్ట్ ఆపరేటర్లయిన తాతారావు, సుబ్బారావు, కామేశం, సరళ డ్యూటీ దిగి ఆఫీసు బయటకు వచ్చారు. ఈ రోజు బాబూరావు ప్రవర్తన విపరీతంగా వుందని ఒకరి నొకరు అనుకున్నారు. కాల్స్ ఎలా అటెండ్ చేసినా ఎప్పుడూ ఏమీ అనని బాబూరావు, కారణం అడక్కుండానే ఎప్పుడువడితే అప్పుడు బయటికి వెళ్ళడానికి పర్మిషన్నిచ్చే బాబూరావు ఈ రోజు అలా విపరీతంగా ప్రవర్తించడానికి కారణమేమిటో అని చాలాసేపు ఆలోచించారు. ఆలోచించగా ఆలోచించగా ఆ నలుగురికీ అది 'రివాల్వింగ్ ఛెయిర్ మహిమ' అని అర్థమయింది. అంతే ! వాళ్ళల్లో వాళ్ళు చాలాసేపు ఏదో గుసగుసలాడుకుని ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయారు.

* * *

మర్నాడు ఎనిమిదింటికి బాబూరావు టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌లోకి అడుగుపెట్టాడు. రోజూ అతని డ్యూటీ వుదయం ఎనిమిదినుంచి సాయంకాలం నాలుగుదాకా వుంటుంది. అతనిది జనరల్ షిఫ్ట్.

తాతారావు, కామేశం, సుబ్బారావు, సరళ బోర్డుమీద వాళ్ళ పొజిషన్స్‌లో కూర్చుని కామ్‌గా పని చేసుకుంటున్నారు.

బాబూరావు ఠీవిగా అడుగులు వేస్తూ రివాల్వింగ్ ఛెయిర్‌ని సమీపించాడు. దర్జాగా కూర్చోబోతు ఛెయిర్‌ని ఒకసారి చూశాడు.

అంతే !

"నా రివాల్వింగ్ ఛెయిర్" అంటూ చిన్నగా గావుకేక పెట్టాడు.

రివాల్వింగ్ ఛెయిర్‌ని పూర్తిగా పనికి రాకుండా ఎవరో బ్లేడుతో కోసేసి స్పాంజి అంతా బయటికి లాగేశారు.

పాపం ! బాబూరావుకి దుఃఖం ముంచుకొచ్చింది.

"ఈ ఛెయిర్‌ని ఎవరిలా చేశారు ?" సీనియర్ ఆపరేటర్ తాతారావుని కోపంగా అడిగాడు.

"ఏమో సార్ ! మాకు తెలీదండీ ! మేము వుదయం ఆరు గంటలకి డ్యూటీ ఎక్కేసరికే అలా వుంది" అని చెప్పాడు తాతారావు.

బాబూరావు లబోదిబోమంటూ ఆఫీసరు అనంతం రూములోకి పరిగెట్టాడు.

అనంతానికి ఏడుపుముఖంతో రివాల్వింగ్ ఛెయిర్‌ని ఎవరో కోసేశారని చెప్పాడు.

అనంతం బాబూరావు వైపు కోపంగా చూశాడు.

"ఇలాంటి పనులు చేస్తారనే ఆఫీసుల్లో మీలాంటివాళ్ళకి ఎవరూ రివాల్వింగ్ ఛెయిర్లు వేయించరు. నీ సీటులో మరొక రివాల్వింగ్ ఛెయిర్ వేయించడమంటూ ఇక వుండదు. ఈ రోజునుంచి నువ్వు ఎప్పటిలా చెక్కకుర్చీలోనే కూర్చో. మళ్ళీ రికమండేషన్ కోసం అమ్మగారి దగ్గరకు పరిగెట్టావంటే ఈసారి నీకు ఛార్జిషీటు ఇస్తాను" సీరియస్‌గా అని తన పనిలో మునిగిపోయాడు అనంతం.

పాపం ! సూపర్‌వైజర్ బాబూరావు కన్నీళ్ళ పర్యంతంతో వెనుదిరిగాడు. ★